కథానిక

# నా జీవితం చాలు

రెండు చేతులలో కూరల సంచీల బరువుతో జారీ పోతున్న హ్యాండ్ బాగ్ సరిచేసుకుంటూ పిల్లల ఇంటికి వచ్చి వుంటారేమోనని హడావుడిగా అడుగులేస్తున్న నాకు కీచుమని సడెన్‌బ్రేకుతో కారాగిన శబ్దంనకు ఆలోచనలకు అంతరాయం కలిగి వులిక్కిపడి తలెత్తా. కారు విండోలోంచి తొంగి చూస్తున్న ఆమె 'హాయ్!రాధా! నువ్వేనా? ఏమీ మారలేదే? ఎక్కడుంటున్నావ్? ఏమిటి విశేషాలు? అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే కళ్ళప్పగించి చూడటం మినహా ఏమి చెయ్యలేకపోయ్యా.

'నన్ను గుర్తు పట్టలేదు కదూ! నేను లతను. డిగ్రీలో నీక్లాస్‌మేట్‌ని. హాస్టల్‌లో రూమ్‌మేట్‌ని. పదేళ్ళు అమెరికాలో వుండి వచ్చాములే, నేను కొంచెం లావుగా వుండేసరికి నువ్వు గుర్తు పట్టడంలా' అంటూ ఆ మార్కెట్ రద్దీలో గడగడ మాట్లాడేసి 'మా ఇంటికి పోదాం రా!' అంటూ చెయ్యిపట్టిలాగి సంచీలతో సహా నన్ను కారులో కూలబడేసింది. కారులోని ఏసి చల్లదనం, స్టీరియోలోంచి సన్నగా వినిపిస్తున్న ఎంఎస్ సుబ్బలక్ష్మి గానం. నన్ను సేదదీర్చాయి. కారులోని మినీఫ్రిజ్‌లోని కూల్ డ్రింక్ ఒక్కొక్క చుక్క గొంతులోకి జారుతుంటే ఆ చల్లదనం వుత్సాహాన్నిచ్చింది. 'ఈ కారు మేము అమెరికా నుంచి వచ్చేటప్పుడు మా వారికి వాండ్ల కంపెనీ ప్రజెంట్ చేసింది. కారులోనే మేకప్‌రూం, లివింగ్ రూం, డైనింగ్ రూం, బెడ్ రూం ఒకటేమిటి? సకల సౌకర్యాలు వున్నాయనుకో! ఈ డర్టీ ఇండియా వచ్చాక ఈ గతుకుల రోడ్లకు కారు పాడవుతుందని షెడ్డు నుంచి తీయలేలేదు. నేను ఈ రోజు ముచ్చటపడి అలా సరదాగా తిరిగి వద్దామని తీసా. ఇక్కడి వెధవలకు దీని సర్వీసింగ్ కూడా చెయ్యడం రాదు. కారుకేసి గుడ్లప్పగించి చూస్తుంటారు' అంటూ నాన్‌స్టాప్‌లా మాట్లాడుతూ "ఏమిటే? మాట్లాడితే ముత్యాలు రాలి పోతాయా? నేనేరుకోలేనులే. పొట్లం కట్టి మీ శ్రీవారికిస్తాలే? నీ సంగతులు ఏమి చెప్పావు కాదే? ఎంతమంది పిల్లలు? మీ శ్రీవారు ఏం చేస్తుంటారు? ఎక్కడుంటున్నారు! వగైరాలన్నీ చెప్పవే? అంటూ నా భుజం పట్టుకుని ఊపుతుండగానే కారు పెద్ద బంగళా ముందు ఆగింది.

మయసభను మరిపించేలా వుండి ఇల్లు. నా కాలు క్రింద మోపితే మురికి అవుతుందేమోనన్నట్లున్న నీడలు తేలే గ్రానైట్ ఫ్లోరింగ్. విండోలోంచి అతిధులను ఆహ్వానిస్తున్నట్లున్న క్రీపర్స్, షాండ్లియర్స్ కాంతి వెన్నెలతో పోటీ పడుతుంటే, ఫారిన్ సెంట్ వాసన వాతావరణాన్ని మత్తెక్కిస్తున్న అనుభూతినివ్వగా ఆ వాతావరణంలోని రిచ్‌నెస్‌కి నేను కట్టుకున్న చీర వెలవెల పోతుంటే పాలిపోయిన ముఖంతో లోపలికి అడుగు పెట్టి సోఫాలో కూర్చున్నా. "ఏమిటే! అలా మల్లె మొగ్గలా ముడుచుకు కూర్చున్నావ్. నీవేమి మారలేదే!" అనే సరికి.

'ఏం పిల్లలెవరూ కన్పించలేరేం! ఇల్లు నిశ్శబ్దంగా వుంది' అన్నా ఏమి మాట్లాడకపోతే బావుండదని.

'పెద్దవాడు సెకండు క్లాసు, చిన్న వాడు ఫస్ట్‌క్లాసు. ఇక్కడుంటే క్రమశిక్షణ వుండదని రుషివ్యాలి స్కూల్లో చేర్పించాము. ఆయన బిజినెస్ పనుల మీద తిరుగుతూ వుంటారు. నేనే ఎప్పుడన్న వెళ్ళి చూసివస్తుంటాము. కాలక్షేపం కాక క్లబ్‌లో చేరా. ఇదో ఇప్పుడు నువ్వు కన్పించేసరికి నాకు ప్రాణం లేచి వచ్చినట్టయింది' అంది.

చిన్ననాటి స్నేహితుల గురించి, అమెరికా అనుభవాల గురించి ఏవో చెబుతూనే వుంది. నేను యాంత్రికంగా ఊకొడుతున్నానే కాని నా మనసంతా ఇంటి చుట్టు తిరుగుతూ వుంది. శ్రీవారు కాఫీ కలుపుకున్నారో? లేదో? పిల్లలు స్కూలు నుంచి వచ్చి ఏం గొడవ చేస్తున్నారో? అత్తగారికి బావుండటం లేదు. అతిశయోక్తులతో తన హోదా తెలియజేయాలని తాపత్రయమే ఎక్కువగా కనబడుతోంది. తీవ్వడ వ్వడు వస్తూ వుండు' అంటూ కారులో దింపమని డ్రైవర్‌ని పంపింది.

'ఏమిటి? ఇంత లేటయ్యింది రాధా? వంట్లో బాగోలేదా? అలా వున్నావేం' అని శ్రీవారు

'లేటయితే ఫోన్ చెయ్యక పోయావా? ఎలాగో నేను మెల్లిగా నాలుగు మెతుకులు వండేదాన్ని కదా! పొద్దునవగా వెళ్ళిని దానిని ఇవ్వడేం చెయ్యగలవ్? అని అత్తగారు అంటుంటే 'అబ్బ ఇంత టైం వాళ్ళింట్లో గడిపావా? అని అమకుంటూ అలవాటైన పనిలోకి చొరబడ్డా.

ఈ మూడు నెలల్లో అత చాలా పార్లు ఆఫీసుకు వచ్చి పుట్టిన రోజుకి



- సి.హెచ్. సుబ్బరత్నం

ఒకసారి, మెట్టిన రోజున మరొకసారి ఏదో ఒక సాకుతో వాళ్ళింటికి లాక్కెళ్ళుతూనేవుంది. ఇంటి దగ్గర రోజూ లేటైతే బావుండదని నేను అప్పడప్పుడు సెలవు కూడా పెడుతున్నా. డాబూ, దర్పం వున్న లత కారులో నన్ను తీసుకెళ్ళడం, క్లోజ్‌గా వుండటం చూసిన కొల్లీగ్స్ ఈ మధ్య నన్ను ఏదో ప్రత్యేకంగా చూస్తున్నట్టు అనిపిస్తుంది. లత వాండ్లాయన మాటల్లో గౌరవం వుట్టిపడుతున్నా చూపులు మాత్రం శరీరాన్నంతా తడిమినట్టు ఇబ్బందికరంగా వుంటున్నాయి. సకల గుణాభిరాముడని తెలుస్తూనే వుంది. కట్టుకపోయినంత ఆస్తి వుందిలే? ఎలా వుంటే ఏంలే? అనుకున్నా. ఇద్దరం సంపాదిస్తున్నా ప్రతినెల లెక్క ప్రకారం ఖర్చు పెట్టుకోవాలి. అదనపు ఖర్చు వస్తే లోటు బడ్జెట్. ఏమిటో ఈ మధ్య తరగతి జీవితం? ఒక సరదా లేదు పాడు లేదు. గానుగెద్దు జీవితం అనుకుంటూ ఇంట్లో అడుగుపెట్టా.

“మమ్మీ! నాకు ఈ లెక్క చెప్పవూ?' అంటూ పాప వచ్చేసరికి అసలే విసుగ్గా వున్న నేను “ఇప్పుడు కాదు పో.......'అని కసురుకున్నా.


మోహం కడుక్కుని కాఫీ తాగుతుంటే బాబు 'మమ్మీ! ఈ బొమ్మ నాకు రావడం లేదు. కొంచెం రఫ్‌గా నీవు గీచిపెట్టు. తర్వాత నేను బాగా వేసుకుంటాను' అంటూ పెన్సిలు నోట్సు తెచ్చాడు. “అబ్బబ్బ! నన్ను విసిగిస్తున్నారురా! అవతలికి పో! కొంచెం సేపు కూర్చొనియ్యరా?' అనేసరికి.

'ఏందే అమ్మాయి? ఎప్పుడూ లేంది. ఈ మధ్య పిల్లలను కసురుకుంటున్నావ్. ఆఫీసులో ఏమైనా గొడవలొచ్చాయా? కొంచెంసేపు అమ్మను రెస్టు తీసుకోనీయండిరా. ఇటురండి కథ చెబుతా' అంటూ అత్తగారు పిలిచేసరికి ఇద్దరు పిల్లలూ వెళ్ళారు.

మొన్న శ్రీవారు కూడా ఇదే కామెంట్ చేశారు. నాకు తెలియకుండానే నాలో ఏదో అసంతృప్తి పెరిగిపోతున్నది. ఫలానా అని చెప్పలేను కాని ఏదో చిరాకు, పనిలో నిర్లిప్తత నిరాసక్తత కూడా అనిపిస్తుంది.

'రాధా! మరీ డల్‌గా వుంటున్నావ్ ఈ మధ్య. ఓ వారం రోజులు సెలవు పెట్టు. పిల్లలను తీసుకుని ఏటైనా వెళ్ళి వద్దాం. డైలీ రొటీన్ నుండి చేంజ్ వుంటుంది' అన్నారు శ్రీవారు.

'మనం తిరిగి వచ్చిన సరదా కాస్తా ఆలోటు బడ్జెట్‌సవరించుకునే సరికి




తలప్రాణం తోక కొస్తుంది. మన బతుక్కి అదొక్కటే తక్కువైందిలే!' అన్నా

'ఇప్పుడు నీకేం తక్కువైందని అలా అనుకుంటావు? మనము ఎంతో మంది కంటే మేలు' అంటూ శ్రీవారు బజారుకెళ్ళారు.

'ఏమిటే రంగీ? రెండు రోజుల నుంచి పనికి రాలేదు. ఇలా చెప్పా పెట్టాకుండా మానేస్తే ఎలా? అన్నా అప్పుడే వచ్చిన పనిమనిషి రంగీతో.

'ఏం చెప్పనమ్మా! మా దొంగ సచ్చినోడు తాగి వచ్చి అర్ధరాత్రి సేపలకూర సెయ్యలేదని ఇరగదన్నాడమ్మా. ఆ దెబ్బలకు వళ్ళంతా పచ్చి పుండులా వుంది. జ్వరం కూడా వచ్చింది అంది.

'నువ్వు వాడిని ఏమి అనకుండా వెనకేసుకొస్తుంటావు అందుకే వాడట్లా తయారయ్యాడు' అన్నా.

'మా బావ నన్ను తన ప్రాణంగా చూసుకుంటాడమ్మా! తాగినప్పుడు వాడికి ఒల్లుపై తెలీదు. తర్వాత తనే ఆ దెబ్బలకు మందు రాసి ఇంకెప్పుడూ కొట్టనే రంగీ' అని బతిమాలుకుంటాడు' అంది.

'నాలుగు రోజులకొకసారి తన్నులు తినడము, మీ బావ మల్లెపూలు తేగానే గిన్నెలక్కడ పారేసి సినిమాకు చెక్కెయ్యడము చూస్తూనే వున్నాగా' అన్నా.

'అమ్మగారో! మా బావశాన మంచోడండి. పండక్కి కొత్తచీర తెస్తాడు. మిఠాయిలు తెస్తాడు. సిన్మాలకి తీసికెళ్తాడు. అంటూ తన బావ ముచ్చట్లు చెప్తుంటే దానికంట్లో వెలుగు తళుక్కుమంటున్నది.

శనివారం క్యాంపు కెళ్ళాలని ఆయన పొద్దునే వెళ్ళారు. నేను ఆఫీసులో వుండగానే 'మీ అత్తగారికి హార్ ఎటాక్ వస్తే హాస్పిటల్‌లో చేర్చాం. వెంటనే రండి' అని పక్కింటివాండ్లు ఫోన్‌చేశారు. నేను ఆఫీసు నుండి డైరెక్ట్‌గా హాస్పిటల్‌కి వెళ్ళి డాక్టర్ గారిని కలుసుకున్నా. 'ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో వుంచాం.. ఏంజియోగ్రాము టెస్టు చేయాలి. వెంటనే పదిహేను డిపాజిట్ చేస్తే టెస్టులన్నీ చేస్తాం' అన్నారు. నెలాఖరు రోజులవడం వలన అంత డబ్బు అప్పటికప్పుడు అప్ప ఎవరిస్తారు? సేవింగ్స్ అకౌంట్‌లోంచి తీద్దామంటే బ్యాంక్ టైం అయిపోయింది. పైగా వరుసగా రెండు రోజులు సెలవులొచ్చాయి. ఆ హాస్పిటల్ నాకు పరిచయం లేనిదవడం వల్ల డబ్బు తర్వాతకడ్డాం అని చెప్పే వీలు లేదు. లతను అడగటం మంచిదనిపించి హడావుడిగా వాళ్ళింటికెళ్ళా.

'నేను టూరుకు పోయానని తెలిసి నీవు ఎవరితో కులుకుతున్నావ్! ఎందుగ్గాను బజారుకెళ్ళావు? ఇంట్లోకి కాపలాగా పడి వుండమన్నాగా? అంటూ హూంకరిస్తున్న లత భర్త గొంతు విపించేసరికి కారిడార్లోనే ఆగిపోయ్యా.

'నీకు అలా మంచిగా చెప్తే బుద్ది రాదే అంటూ కాలుస్తూన్న సిగరెట్ పీకతీసి చేతులపైనా, ముఖంపైనా అద్దుతూ ఒక చేత్తో లతనోరు గట్టిగా మూసాడు. ప్రక్కనే నిల్చొని వున్న ఫాషన్ లేడీని చూస్తూ 'కమాన్! డార్లింగ్! ఈ ఛీట్‌తో నీ మూడ్ పాడయినట్టుంది. లెట్ అజ్ ఎంజాయ్ అంటూ ఆమె నడుము మీద చేతులేసి బూట్లు టకటకలాడించుకుంటూ ఆమెతో మేడపైన వెళ్ళడం కన్పించింది. ఈ సమయంలో నేను వెళ్ళడము సబబుకాదనికొని, డాక్టర్‌గారికి రెండురోజుల్లో డబ్బు సర్దుబాటు చేస్తామని చెబుదామని నిర్ణయించుకున్నా. సిరిసంపదలుంటే సుఖపడతారని నేననుకుంటుందే పాపం లత జీవితం ఇలా వుందే! ఎలా భరిస్తున్నదో! అని ఆలోచిస్తున్న నాకు అయిదారడుగుల దూరంలో ఒకరిపైనొకరు వాలిపోతూ, ఏదో వూసులాడుకుంటూ పరిసరాలను మరిచిన ఓ జంట సినిమా నుండి వస్తున్నట్టున్నారు. అలా మేమిద్దం మాట్లాడుకుని ఎన్నాళ్ళయ్యిందో కదా? నా చిరాకు, అశాంతి వల్లనేమో ఆయన ఈ మధ్య దూరంగా వుంటున్నారు. నాలో ఈ మార్పేమిటో నాకే అంతుబట్టడం లేదు.

'అమ్మగారూ! ఇయ్యాలటప్పుడు మీరొక్కరే యాడకుపోతున్నారు. నేన్ను మామావ వచ్చి దిగబెడతాం పదండి' అనే రంగి గొంతు వినేసరికి నాలో ఏదో సంఘర్షణ మొదలైంది. రంగి ఏదో మాట్లాడుతుంటే పరధ్యానంగానే జవాబు చెబుతూ హాస్పిటల్ వైపు నడుస్తున్న నాకు ప్రక్కన స్కూటరు ఆగేసరికి వులిక్కిపడ్డా.

'క్యాంపు కేన్సిలయ్యింది. ఆఫీసు నుండి రాగానే ప్రక్క పోర్షన్‌వాండ్లు చెపఅరు. నీవు ఎంత ఆందోళన పడుతున్నావోనని నేను వెంటనే వచ్చేసా"నని శ్రీవారు స్కూటరు స్టాండు వేసి మాట్లాడుతుంటే నాలో ఇన్ని రోజులు పేరుకుపోయిన అసంతృప్తికి కారణం తెలిసినట్టయింది. లతతో పోల్చుకుని లేని సంపద కోసం తాపత్రయపడి అశాంతిని కొని తెచ్చుకున్నా. రంగి తనకున్న దానితో తృప్తి పొంది హాయిగా నవ్వగలుగుతుంది. ముత్యాల్లాంటి పిల్లలు, కన్న తల్లిలాంటి అత్తగారు, ప్రేమగా చూసుకునే భర్త వున్నా కూడా ఇంకొకరితో పోల్చుకుని అమృత భాండం లాంటి కాపురాన్ని చేజేతులా పాడుచేసుకోబోయానే అనే మానసిక సంఘర్షణలో ఆయన పలకరించేసరికి నాలో నాలో అణచి పెట్టుకున్న అశాంతి దుఃఖరూపంలో కట్టలు తెంచుకుని ఆయన షర్టును తడిపేస్తుంటే 'ఏమిటి! పిచ్చి! లే.ఎందుకంత బేలవైపోతావ్! ఏమీ పర్వాలేదు' అంటూ ఆర్తిగా తల నిమురుతూ ఆయన చెబుతుంటే ఇన్ని రోజులు నేను పడ్డవేదనంతా చేతుల్తో తీసేసినట్టయింది. పక్కనటీ బంకులోంచి ఘంటసాల గొంతులోంచి మధురంగా 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ..... అదే స్వర్గమూ' అనే పాట గాలిలో తేలి వా చెవికింపుగా వినిపిస్తుంటే 'నాకీ జీవితం చాలు' అనే ఆత్మసంతృప్తితో చాలా రోజుల తర్వాత మనస్ఫూర్తిగా నవ్వా.